
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# ఎవరి పిలుపు వారిది



సురాశర్మ

మాకాలనీలో మా ఇరుగు పొరుగునున్న కేప్టన్ సుందర్రావు, డిప్యూటీ కలెక్టర్ ధర్మారావు, ఇంజనీరు మహేంద్రనాథ్, పోలీస్ ఇన్స్పెక్టర్ శాయినాథ్ మరియు కాంట్రాక్టరు కరీ సాహెబ్‌గార్లకు నేనంటే లోలోపల మంట. అందుకు కారణం - నేను ఏనాది ఎరుకలయ్యను మా ఆవరణలో కాస్తంత చోటిచ్చి ఓ కొట్టం వేసు కొని కాపురముండమన్నానని. మన మెంత మన డిగ్నిటీ ఎంత అన్నధోరణి లోనే వుంటారువారు.

ఎరుకలయ్య, అతడి భార్య మారెమ్మ కష్టజీవులు. వారికి యిద్దరు పిల్లలు కాగానే ఈ దేశ శ్రేయస్సుకోసం ఆపరేషన్ చేయించుకొన్న ఉత్తమ పౌరులనవచ్చు. అదే సుందర్రావు, ధర్మారావు, మహేంద్రనాథ్, శాయినాథ్, కరీమ్ సాహెబ్‌గార్లు అందరికీ ఐదు, ఆరు, ఏడు సంఖ్యల్ని మించిన సంతానమే వుంది. మా విషయం అందుకు భిన్నం. మేమెన్ని గుళ్లు గోపురాలకు మొక్కినా పిల్లలు కాలేదు. చిన్నప్పటించి మా వద్ద పెరిగిన మా అన్నయ్య కుమార్తె అన్నపూర్ణ మాత్రం మావద్దనే వుంటోంది ఆ లోటు తీరుస్తూ!

ఎరుకలయ్య దంపతులు మొదట్లో వేపల్ని యిండకాయల్ని పట్టి అమ్మేవారు. ఒక్కోరోజు అవి గిట్టుబాటు కాక పస్తులుండేవారు. అది చూసి నేను అతడికి బజారు పనులప్పగించాను.

వంద కిలోల బియ్యపుబస్తాను అవలీలగా భుజాల కెత్తుకొని మండీల నుండి దుకాణాలకు మోస్తుంటాడతడు. బస్తాకు అర్ధరూపాయి చొప్పున యిరవై బస్తాల పైనే మోసేసి రోజుకి పది పన్నెండు రూపాయిల్ని కళ్ల చూసేలా చేశాను. మా ఆవిడ మాలతి మారెమ్మకు కొన్ని యిళ్ల పాచి పనులు అప్పగించింది. ఆవిడ సైతం నెలకు వంద రూపాయలు గిట్టించు కొంటుంది. ఎరికలయ్య కెలాంటి దుర్గుణాలు లేవు. బీడి కూడా ముట్టడతడు. ప్రొద్దునే సద్ది తాగేస్తారు వాళ్ళు. మధ్యాహ్న సాయంత్రాలు సంగటి రొట్టెలు ఇళ్లనుండి తెచ్చుకొన్న సాధకాలతో సరి పుచ్చు కొంటుంటారు. ప్రతి ఆదివారం రెండేసి మూడేసి సినిమాల్ని చూసేస్తుంటారు.

కేప్టన్ సుందర్రావు బాదుగలు సంపాదించేందుకు హవేలీలు ఒకొక్కటే కట్టిస్తూండే మా

వీధిలోని హావేలీలో రామ్‌లాల్ వచ్చి చేరాడు. అతని భార్య ధనమ్మ. వారికిద్దరు పిల్లలు. వాళ్లు కాన్వెంటు చదువులు చదువుతున్నారు. ఎక్కడో ట్రంకు రోడ్డు మీద టీ బంకు పెట్టుకొన్న రామ్‌లాల్ బాగానే సంపాదిస్తుండే వాడు. అతడ్ని ఆ స్థలం యజమాని ఖాళీ చెయ్యమనడంతో అతడిక్కడి కొచ్చి చేరి చేరువనున్న అప్సర థియేటర్ వద్ద పెట్టాడు. కానీ ట్రంకు రోడ్డు మీద వుండిన గిరాకీ యిక్కడ లేక పోయింది. నష్టాలు రా బట్టాయి. పిల్లలా? కాన్వెంటులో చదివే వారైరి. ఇక లాభం లేద నుకొని బొంబాయి హార్బర్‌లో పని చేసి నీకు డబ్బు పంపుతా నని ఒకరాత్రి బొంబాయి మెయిలెక్కి వెళ్లి పోయాడు రామ్‌లాల్. ధనమ్మ పెద్ద జుట్టు విశాల నేత్రాలు, తెల్లటి తెలుపుతో బాగా నాజూకుగా అందంగా వుంటుంది. ఆమెను చూస్తే కష్టమంటే ఎలాంటిదో తెలియని మనిషిలా కన్పిస్తుంది. అయితే పిల్లల చదువులు ఆగిపోగూడదు కదా. అందుకుని ఇంట్లో చిన్న అంగడి పెట్టుకొన్నది. ఇంటి ముందు పెనం పెట్టి దోశలు వేస్తోంది. ఎలాగో తంటాలు పడుతోంది. వీధిలో అందర్నీ నవ్వుతో పలుకరిస్తూ మంచిగా వుంటోంది. మా ఆవిడను వొదినా అంటూ, నన్ను అన్నయ్య అంటూ తన కష్టసుఖాలు చెప్పుకొంటూంటుంది ధనమ్మ. ఆవిడను చూస్తే మా కాలనీలో మాకేగాక అందరికీ యిష్టమే. ఆదివారాలు అంతా కలుస్తుంటాము. కేప్టన్ సుందర్రావు తన మిలటరీ అనుభవాలు గొప్పగా చెప్పుకొంటుంటాడు. ఫ్రంట్ రంగంలో తను సేనలనెలా నడిపిందీ, టాంకులతో పాకిస్తాన్ సేనల్ని ఎలా దెబ్బ తీసిందీ పేము కుర్చీలో కూర్చొని పెద్దగా నవ్వుతూ మీసాలు మెలేస్తూ చెబుతుంటాడు. ముఖ్యంగా ధనమ్మ వినాలని అతడి ఆరాటం. డిప్యూటీ కలెక్టరు ధర్మారావు తన ఎదుట చేతులు కట్టుకునిల్చొన్న జవాన్లు గుమస్తాల ఎదురుగా అట్టహాసాలొలుక బోస్తూ గొప్పలు చెబుతుంటాడు. ఇంజనీరు మహేంద్రనాథ్ తన గొప్పలు తనూ చెబుతూనే వుంటాడు. ఇన్స్‌పెక్టర్ శాయినాథ్ తన గొప్పను తన ఎదురుగా శాల్యూట్ చేసి నిల్చొన్న ఆర్డర్లీలను, దొంగలను బండబూతులు తిడుతూ చాటుకొంటాడు. ఇలా ఇహ కంట్రాక్టర్ కరీమ్ సాహెబ్ తను రోడ్లు వేసే కంట్రాక్టు పనుల్ని ఎంతో నిజాయితీతో చేస్తుంటానని చెప్తాడు. అరణ్యాలలో కొత్త రోడ్లు వేస్తున్నప్పుడు ఎదురయ్యే ప్రమాదాల్ని వింత వింత కథల్లా చెబుతుంటాడు. ఎన్నో క్రూరమృగాల్ని, రకరకాల పాముల్ని ఇట్టేపట్టి అట్టే చంపేస్తుండేవాడినని చెబుతుంటాడు. ఒకసారి ఒక పెద్ద కొండ శిలువ రోడ్డు కడ్డంగా పడుకొందట. దాన్ని అవతలకి తోలటానికి అక్కడి ఇంజనీర్లకు గానీ, మేస్త్రీలకుగానీ కూలీలకుగానీ దమ్ముల్లేక పోయాయట. అప్పుడు తను ఒక పెద్ద కట్టెతో దాన్ని ఎత్తి అవతలకి కుదేస సరికి అది అల్లా మియా అంటూ పరుగెత్తి పోయిందిట. అతడు సైతం మహా పటాటోపంగా ధనమ్మకు విన బడేలా గడ్డం నివురుకొంటూ టోపి సర్దుకొంటూ చెప్పుకు పోతుంటాడు. నేను విద్యుచ్ఛక్తి శాఖలోని ఒక అనామక యు.డి.సి. క్లర్కుని. వారితో పోలిస్తే నేను నథింగ్ అనే చెప్పాలి. ఎటొచ్చీ వాళ్లు పై అంతస్తులవాళ్లు కాబట్టి వాళ్లేం చెబు తున్నా నవ్వుతూ మౌనంగా వినడం నా వంతు. ఆ రోజు ఆదివారమైనా నేను రైల్వే కోడూరు క్యాంపు వెళ్లాల్సి వచ్చి రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరగానే మా అన్నపూర్ణ ఉత్సాహం ఉరకలు వేస్తూ ఎదురొచ్చి "బాబాయ్! ఇవాళ ఒక అద్భుతవింత జరిగింది" అంది. "ఏందమ్మా అది" అన్నాను నేను నవ్వుతూ. మా ఆవిడ కూడా నవ్వుతూ వచ్చి---

"మన ధనమ్మ హావేలీ ప్రక్కన పునాది రాళ్ల గుట్ట లేదూ?" అంది.

"అవును వుందీ?" అన్నాను నేను. "ఆ రాళ్ల సందుల్లోంచి ఓ పాము కదలాడుతోంటే ధనమ్మ చూసి కెవ్వున కేకసి కేప్టన్ సుందర్రావుతో మొరపెట్టు కొంది. సుందర్రావు పెద్ద వీరుడిలా ఓ కట్టె తీసుకొచ్చి రాళ్లలోకి తొంగి చూసి "అమ్మో! అది నాగుపాము" అన్నాడు. ఇంతలో ధర్మారావు గారొచ్చి కళ్లాద్దాల్లోంచి తేరిపార జూసి "అవునమ్మోయ్! బుసలు కూడా కొడుతూంది" అన్నాడు. సుందర్రావు నసుగుతూ-- "ఎందుకైనా మంచిది కంట్రాక్టరు కరీమ్‌నిలా పిలవ్వయ్యా, ఆయన ఎన్నో పాముల్ని కొండ శిలవల్నీ చంపేశానంటుంటాడు కదా?" అన్నాడు. కరీమ్ సాహెబ్ లుంగీతో గడ్డం నివురు కొంటూ వచ్చి వొంగి దాన్ని గమనించి -- "ఇది నిజంగా నాగుపామేనండీ. కట్టెలతో కొడితే తప్పించుకు పారిపోయి మన పై పగబట్టి వరసగా అందర్నీ చంపెయ్యగలదు." అంటూ "సార్! ఇన్స్‌పెక్టర్ సాబ్! మీరు పిస్టల్ తీసుకొచ్చి దాన్ని ఒకే షాట్‌తో సఫా చెయ్యండి సాబ్" అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ శాయ్‌నాథ్ పిస్టల్ తోనే వొచ్చాడక్కడి. దాన్ని పరికించి చూశాడు. "చూడండీ! నేను పిస్టల్‌తో దాన్ని కాల్చగలను. నోడౌట్. కానీ అది నాగుపాము. మాకు నాగ ప్రతిష్ఠ వుంది. రండి రండి అందరూ దూరం వచ్చెయ్యండి. దానంతకదే వెళ్ళిపోతుంది" అనేశాడు.

అందుకు ధనమ్మ విలపించింది. "హాయ్ వొంటరి మనిషిని నాగతేంగాను!!" అనగానే నేను ధనమ్మ వెనక చేరి ధైర్యం చెప్పాను. అప్పుడే మేట్నీ కెళ్లి వచ్చిన ఏనాది ఎరికలయ్యకు చెప్పాను విషయం.

అతడు వెంటనే "పదండమ్మా" అంటూ చేతిలో ఏ ఆయుధం లేకుండానే వచ్చి పునాది రాయిని అవతలకీ తోసి చూశాడు. పాము కదులుతోంది. ఎరికలయ్య అవలీలగా దాన్ని చేత్తో పట్టి గిరగిరా తిప్పి రాతికేసి కొట్టాడు. దాని తలపగిలి రక్తశిక్తమైంది. వెంటనే దాన్ని నేలమీద పడేశాడు. అది ఒకటి రెండు చావు మెలికలతో ప్రాణాలు విడిచింది. ధనమ్మ గొప్పవూరట పొందింది. అంతా సైలెంట్ స్పెక్టేటర్సులాగా నిల్చొన్నారు.

"నాయనా ఎరికలయ్యా! అదేం పాము?" అన్నాను నేను.

"అమ్మగారూ! అదొట్టి నీరు గట్టు పాపండి" అన్నాడతడు. తనపనైపోయినట్టు వెళ్లిపోతూ" అని ముగించింది మా ఆవిడ. ●

---

తప్పులెన్నువారు...... ముగింపు

సిగ్గు లేకుండా డాక్టరుగార్ని... ..."

రాంమూర్తి చెపుతూనేవున్నాడు, మధ్యలో మాష్టరు అందుకొని "తను ఎన్ని తప్పులు చేసినా తనని తప్ప మిగతావాళ్లందర్నీ విమర్శించగలాడు మనిషి! అదే అతనిలో గొప్పతనం మరి!

వీళ్లకున్న వేళ్లన్నీ యితరులవైపే చూపుతాయి. ప్రజలకు తాము మంచి కొంచెమైనా చేయక పోయినా, ప్రభుత్వం ఏమి చేసినా ఎప్పుడూ విమర్శించే ప్రతిపక్షం లాంటివాళ్లు వీళ్లు!

బురదలో బెడ్డ వేస్తే అది అందరిమీదా చిందుతుంది.

ఇతరులమీద పేడముద్దలు కొడితే మన చేయీ పాడవుతుంది.

విమర్శ అనేది పెంపుడు జంతువు లాంటిది. తిరిగి తిరిగి మనింటికే వస్తుందని ఎవరో చెప్పారు!

అయినా —

డాక్టర్ జాన్సన్ ఏమన్నాడో తెల్సాండీ? "దేవుడంతటివాడే మనిషి చచ్చేవర్కు వాడి మంచి చెడ్డల గురించి మాట్లాడడు. మరి మనిషి బ్రతికుండగా వాడెంత చెడ్డవాడైనా విమర్శించడానికి నువ్వూ నేనూ ఎవరం?" అని.

బాగా చెప్పారు కదాండీ!" నారాయణమూర్తి గారు అడిగారు, రాంమూర్తిని.

రాంమూర్తి మరింక మాట్లాడలేదు. ఏమను కున్నాడో మరి!